సర్కారు తీరు.. రైతు బేజారు

- మారుతున్న వాతావరణ పరిస్థితులతో ఇక్కట్లు
- ధాన్యం కొనేందుకు ప్రభుత్వం నిరాకరణ
- ఆందోళనలో అన్నదాత
- అయినకాడికి కాజేసేందుకు దళారులు సిద్ధం



దుళ్ల గ్రామంలో కళ్లాల్లోనే ఉన్న ధాన్యపు రాశులు

కడియం: అకాల వర్షాలు ఓవైపు రైతులను తరుముతున్నాయి. ఉన్నట్టుండి మారిపోతున్న వాతావరణం ఏ క్షణాన ఎలా ఉంటుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. కడియం మండలంలో మొత్తం 2,623 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. ఇంకా 30 శాతానికి పైగా పంట కోతలు పూర్తి కావాల్సి ఉంది. కోసిన పంటలో 20 నుంచి 25 శాతం వరకు ఇంకా కళ్లాల్లోనే ఉన్నట్టు రైతులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు నిలిపివేసింది. ఓవైపు మారుతున్న వాతావరణంతో ఆందోళన, మరోవైపు ధాన్యం కొనేందుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో, దళారులకు అయినకాడికి అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుళ్ల, మురమండ, మాధవరాయుడుపాలెం, కడియం, వేమగిరి తదితర గ్రామాల్లో పలువురు రైతులు తమ పంటను కోసేందుకు వాతావరణం అనుకూలంగా మారే తరుణం కోసం ఎదురు చూస్తున్నారు. కోతలు పూర్తయిన వారు మాత్రం.. కొనేవారి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

దళారుల దోపిడీ

విపరీత వాతావరణ పరిస్థితులకు తోడు, ప్రభుత్వం కొనుగోళ్లు నిలిపివేయడంతో దళారుల దోపిడీకి తెర లేచిందని రైతులు చెబుతున్నారు. రూ.1,725కు కొనాల్సిన ధాన్యాన్ని రూ.1,400 నుంచి రూ.1,550 మధ్య అడుగుతున్నారని, ఈ లెక్కన ప్రతి ఎకరాకు రైతుకు రూ.5 వేల నుంచి రూ.8 వేలు నష్టపోవాల్సి వస్తోందంటున్నారు. తమ వద్దకు తెచ్చిన ధాన్యాన్ని మిల్లర్లు పరిశీలించి, తేమ ఉందని, నూక అయిపోతుందంటూ వంకలు పెట్టి, ధరను దారుణంగా తగ్గించేస్తున్నారని గగ్గోలు పెడుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలోకి పడిపోయారు. నిర్దిష్టమైన పర్యవేక్షణ లేకపోవడంతో మిల్లర్లు, దళారులు చెప్పిందే వేదంగా ధాన్యం కొనుగోళ్లు సాగుతున్నాయని చెబుతున్నారు. ఒకే రాశిలోని ధాన్యాన్ని రెండు వేర్వేరు మిల్లులకు తీసుకువెళితే, ఒక్కో మిల్లు వద్ద ఒక్కో రకంగా ధరను నిర్ణయిస్తూ తమతో ఆడుకుంటున్నారని రైతులు వాపోతున్నారు.

యంత్రాల అద్దె కూడా..

రైతుల అసహాయ పరిస్థితిని అదనుగా చేసుకుని కోత మెషీన్ల ధరలను కూడా పెంచేశారంటున్నారు. గంటకు రూ.2,300కు కోత కోసే యంత్రం అద్దెను ప్రస్తుతం రూ.2,600 వసూలు చేస్తున్నట్టు చెబుతున్నారు. ఓవైపు ధాన్యం బస్తాకు రూ.150 నుంచి రూ.250 వరకు నష్టపోతుండగా, మరోవైపు అదనంగా మెషీన్లకు ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు వివరిస్తున్నారు. ఒకవేళ ధాన్యం నిల్వ చేసుకునేందుకు కూడా అవకాశం లేకపోవడంతో, అయినకాడికి రైతులు తమ పంటను అమ్ముకోవాల్సి వస్తోందంటున్నారు.

రూ.200 తగ్గించి అడుగుతున్నారు

ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే రూ.200కు తగ్గించి దళారులు అడుగుతున్నారు. దాదాపు 300 బస్తాల ధాన్యం నా వద్ద ఉంది. ఆ లెక్కన రూ.60వేలను నేను నష్టపోవాల్సి వస్తోంది. నిల్వ చేసుకుందామంటే ఇంకా తక్కువకు అడుగుతారేమోనన్న భయం ఉంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– బి.ఆనంద్, రైతు, దుళ్ల

కొనుగోళ్లు నిలిపివేయడం దారుణం

ప్రభుత్వం పంట నమోదు చేసుకుంది. ఇంత పంట దిగుబడి వస్తుందని అంచనా ఉంది. అయినప్పటికీ ధాన్యం కొనకుండా నిలిపివేయడం దారుణం. మరి అటువంటప్పుడు పంట నమోదు ఎందుకు చేశారు. ఇప్పుడు రైతులకు జరుగుతున్న నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారు.

– సన్నపు బ్రహ్మానందం, రైతు, దుళ్ల

ప్రజా సమస్యలకు నాణ్యమైన పరిష్కారం

కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్



అర్జీ స్వీకరిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం అందజేస్తామని కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 19 అర్జీలను స్వీకరించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కేతన్ గార్గ్ మాట్లాడుతూ, నగరపాలక సంస్థ పరిధిలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామన్నారు. పారిశుధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వరరావు, ఎంహెచ్ఓ వి.వినూత్న, ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, సిటీప్లానర్ జి.కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారులకు వారెంట్లు

సాక్షి, అమరావతి: కోర్టు ధిక్కార కేసులో పలువురు పురపాలక శాఖ అధికారులకు హైకోర్టు బెయిలబుల్ వారెంట్లు జారీ చేసింది. కోర్టు ధిక్కార కేసులో ఇచ్చిన నోటీసులకు స్పందించడం కానీ, న్యాయవాది హాజరు కావడం కానీ లేకపోవడంతో అప్పటి రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ డి.దినేష్‌కుమార్, సిటీ ప్లానర్ జీవీఎస్ఎస్ మూర్తి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ టీఎస్ అనితకు బెయిలబుల్ వారెంట్లు ఇచ్చింది. తదుపరి విచారణను జూన్ 18కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. రాజమహేంద్రవరం పురపాలక అధికారులు ఎలాంటి పరిహారం చెల్లించకుండా తమ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారని, ఈ విషయంలో చట్ట ప్రకారం వ్యవహరించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ కె.బలరామకృష్ణ, మరో నలుగురు 2022లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు, స్వాధీనం చేసుకున్న భూమికి గాను పిటిషనర్లకు 8 వారాల్లో టీడీఆర్ బాండ్ ఇవ్వాలని మున్సిపల్ అధికారులను ఆదేశిస్తూ 2023లో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను ఇప్పటి వరకు అమలు చేయలేదంటూ కె.పూర్ణ గంగాభవాని గతేడాది హైకోర్టులో కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన హైకోర్టు కౌంటర్ దాఖలు చేయాలని అప్పటి రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ డి.దినేష్‌కుమార్, సిటీ ప్లానర్ జీవీఎస్ఎస్ మూర్తి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ టీఎస్ అనితను ప్రతివాదులుగా పేర్కొంటూ ఆదేశించారు. ఈ ధిక్కార పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ఆ తరువాత కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశాలిచ్చింది. కౌంటర్లు దాఖలు చేయడం కానీ, వారి తరఫున న్యాయవాదులు హాజరు కావడం కానీ జరగలేదు. దీంతో హైకోర్టు ఇటీవల ఈ ముగ్గురికీ బెయిలబుల్ వారెంట్లు జారీ చేసింది. విచారణను జూన్ 18కి వాయిదా వేసింది.

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం



ఖైదీలనుద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకరిస్తుందని ఆ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి అన్నారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారాన్ని సోమవారం ఆమె సందర్శించారు. జైలులో ఆహార ప్రమాణాలు, ఇతర సదుపాయాలను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడారు. వారి తరఫున ఉచితంగా వాదించేందుకు న్యాయవాదులు కావాలన్నా, బెయిల్ పిటిషన్లు, పై కోర్టుల్లో అప్పీలు వేయాలన్నా, మరే ఇతర న్యాయ సహాయం కావాలన్నా తమ సంస్థ సహకారం అందిస్తుందని తెలిపారు. ఎవరైనా ఖైదీలు న్యాయ సహాయం కావాలని అనుకుంటే సంస్థ నియమించిన పారాలీగల్ వలంటీర్ల ద్వారా అర్జీలు అందించాలని సూచించారు. ముద్దాయిలు, ఖైదీల కోసం పని చేస్తున్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను వినియోగించుకోవాలని శ్రీలక్ష్మి అన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

కూలీల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు. చిత్రంలో సర్పంచ్ స్టాలిన్

కడియం: తమకు పనులు కల్పించాలని జేగురుపాడు గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం కూలీలు సోమవారం ఆందోళన చేశారు. జేగురుపాడు సర్పంచ్, వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్‌తో కలిసి తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల వద్ద తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇటీవల తమ గ్రామానికి చెందిన ఫీల్డు అసిస్టెంట్‌ను విధుల నుంచి తొలగించారన్నారు. అప్పటి నుంచి తమకు పనులు కల్పించడం లేదన్నారు. 18 రోజుల నుంచి పనులు కేటాయించడం లేదని వాపోయారు. ఇటీవల వేరే సిబ్బంది వచ్చి పనులు చేయించారని, ఆన్‌లైన్‌లో తమ హాజరు నమోదు కావడం లేదన్నారు. వారానికి ఒకసారి పే స్లిప్ ఇచ్చేవారని, అందులో తమ పనిదినాలు ఉండేవన్నారు. ఇప్పుడు ఇటువంటివేమీ ఇవ్వకపోవడంతో పని దినాలు ఎన్ని అనేది తెలియడం లేదన్నారు. తమకు రెండు నెలలుగా వేతనం అందడం లేదన్నారు. సక్రమంగా పనిచేస్తున్న తమను ఇలా ఇబ్బందులు పెట్టడం తగదని, తక్షణం తమకు పనులు కల్పించాలని కోరారు. గ్రామానికి చెందిన పలువురు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఇద్దరు యువతుల అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు యువతులు అదృశ్యమైనట్లు బొమ్మూరు పోలీసు స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. జిరాక్స్ తీసుకుని వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన తన కుమార్తె తిరిగి ఇంటికి చేరలేదని రాజమండ్రి శాంతిపురానికి చెందిన చొప్ప లోవరాజేశ్వరి సోమవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు, లోవ రాజేశ్వరి శాంతిపురంలో అద్దె ఇంట్లో ఉంటూ, తన 17 ఏళ్ల కుమార్తెను చదివించుకుంటోంది. గత నెల 27వ తేదీ సాయంత్రం జిరాక్స్ తీయించుకుని వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన కుమార్తె ఇప్పటి వరకు తిరిగిరాలేదు. శనివారం ఉదయం 6 గంటల సమయంలో నీళ్లడబ్బాపై ఫోన్ పెట్టి ఉందని, తన కుమార్తె ఇంటికి వచ్చి ఫోన్ పెట్టి వెళ్లిపోయిందని భావించి పరిసర ప్రాంతాలు వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. బొమ్మూరు పీఎస్ ఎస్సై అంకారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఫోన్ తీసుకుని..

ఇంటి నుంచి వెళ్లిన తన కుమార్తె తిరిగి రాలేదని లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన కప్పలకుమారి సోమవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు, హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన 23 ఏళ్ల కప్పల శ్రావణికుమారి పదో తరగతి వరకు చదివి, ఇంటి వద్దే ఉంటోంది. ఆదివారం రాత్రి ఏడు గంటల సమయంలో తల్లి పడుకుని ఉన్నప్పుడు ఫోన్ తీసుకుని వెళ్లిపోయింది. తన ఫోన్ పనిచేయడం లేదని, పరిసర ప్రాంతాలు వెతికినా కుమార్తె ఆచూకీ లభించలేదు. బొమ్మూరు పీఎస్ ఎస్సై ఆర్.మురళీమోహన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధులకు పింఛన్ల పంపిణీ



వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

సీటీఆర్ఐ: దాదాపు ఒకటిన్నర దశాబ్దాలుగా క్రమం తప్పకుండా వృద్ధులకు పింఛన్లు అందించడం అభినందనీయమని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి అన్నారు. సోమవారం వాకర్స్ యోగా అండ్ లాఫింగ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఆనందా గార్డెన్స్‌లో అధ్యక్షుడు శనపతి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సభలో వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. రూ.500 చొప్పున మొత్తం 80 మందికి రూ.40 వేలు పింఛన్లుగా అందజేశారు. హెర్బల్ ఫౌండేషన్ సూపర్‌వైజర్ ఎన్.సంతోష్ వృద్ధులకు అల్పాహారం, బండి శ్రీనివాసరావు క్లబ్‌కు రూ.వెయ్యి విరాళం అందించారు. ముఖ్య అతిథులను క్లబ్ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు, అనసూరి శ్రీనివాస్, ఉప్పులూరి కాశీవిశ్వనాథ్, ఏవీపీ నాగేంద్ర, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎస్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆవ భూముల్లో అక్రమ సాగు

కోరుకొండ: ప్రభుత్వ భూముల్లో వేరుశనగ, మొక్కజొన్న అక్రమ సాగుతో పాటు, సహజ సిద్ధంగా పెరిగిన జామాయిల్ చెట్లను అమ్ముకుంటూ కొందరు అక్రమార్జన చేస్తున్నారు. రాజమహేంద్రవరం, రూరల్ నియోజకవర్గాల్లోని పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వడానికి బూరుగుపూడి సమీపంలో 586 ఎకరాల భూములను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొనుగోలు చేసిన సంగతి విదితమే. ఆయా భూ యజమానులకు నగదు చెల్లించడంతో భూములన్నీ ప్రభుత్వపరమయ్యాయి. కాగా కొందరు రాజకీయ నాయకుల అండతో ఈ భూముల్లో అక్రమ సాగుకు ఎగబడ్డారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలను సైతం బేఖాతరు చేసి, ప్రస్తుతం వేరుశనగ, శనగ పంటను సాగు చేస్తున్నారు. రెండు నెలల క్రితం అక్రమ సాగుపై కలెక్టర్‌కు ఫిర్యాదులందగా, ప్రభుత్వ భూములను సంరక్షించాలని అప్పట్లో రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ క్రమంలో తహసీల్దార్ తమ సిబ్బందితో వెళ్లి ఆయా భూములను పరిశీలించారు. అదే సమయంలో అక్రమంగా సాగుచేస్తున్న మొక్కజొన్న పంటను ధ్వంసం చేయించారు. అయినప్పటికీ అక్రమార్జన కోసం కొందరు మళ్లీ సాగు చేపట్టారు.

24 టన్నుల కలప అమ్మకం

సహజసిద్ధంగా పెరిగిన జామాయిల్ చెట్లనూ నరికేసి అక్రమార్కులు అమ్ముకుంటున్నారు. ఇప్పటివరకూ 103 ఎకరాల్లో విస్తరించిన జామాయిల్ చెట్లు నరికేశారు. అదే మొదలుతో పెరుగుతున్న మొక్కలను సైతం నరికి, సొమ్ము చేసుకుంటున్నారు. రెండు నెలలుగా 24 టన్నుల జామాయిల్ కర్రలను విక్రయించినట్టు చెబుతున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సారా విక్రేతపై పీడీ యాక్ట్

రాజమహేంద్రవరం రూరల్: సారా రవాణా, విక్రయాలు చేస్తున్న రాజమండ్రి అయ్యప్పనగర్‌కు చెందిన పోలిశెట్టి లక్ష్మిపై ఎక్కువ కేసులు నమోదు కావడంతో, ఆమెపై పీడీ యాక్ట్ పెట్టినట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆమెను రాజమండ్రి మహిళా జైలుకు తరలించినట్టు చెప్పారు. నవోదయం 2.0లో భాగంగా డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాలు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఉత్తర్వుల మేరకు పోలిశెట్టి లక్ష్మిపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్టు వివరించారు. సారా తయారీ, నిల్వ, రవాణా, అమ్మకాలు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సారాపై సమాచారం తెలిసిన వారు కంట్రోల్ రూమ్ నంబర్ 14405, సౌత్ స్టేషన్ 94409 02411లో తెలపాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

చెక్కుల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న పలువురికి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తన కార్యాలయంలో సోమవారం నలుగురికి రూ.3.23 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. దామిరెడ్డిపల్లికి చెందిన పెనుమాక వీరవెంకట సత్యనారాయణమూర్తికి రూ.2,18,400, శాటిలైట్‌సిటీకి చెందిన పెంకే చంద్రశేఖర్‌కు రూ.35 వేలు, ధవళేశ్వరానికి చెందిన గ్రంధి సుజాతకు రూ.50 వేలు, రాజవోలుకు చెందిన బూరిగ మంగకు రూ.20 వేల చెక్కులను అందించారు. ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి హామీ పనుల పరిశీలన



మస్టర్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీవో డి.శ్రీనివాసరావు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మస్టర్లను పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. రోజువారి వేతనం రూ.300 వచ్చేలా పని చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి బీమా యోజన కచ్చితంగా నమోదు చేయించుకోవాలని కూలీలకు సూచించారు. పని ప్రదేశంలో ఫస్ట్ ఎయిడ్ కిట్, నీడ, తాగు నీరు అందుబాటులో ఉండాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. ప్రతి కుటుంబానికి వంద రోజులు పూర్తయ్యేలా పనులు సిద్ధం చేసి, జాబ్ కార్డుదారులు అందరినీ పనికి తీసుకురావాలని తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: బొమ్మూరు సబ్ స్టేషన్ వద్ద కొత్త బ్రేకర్లను అమర్చటం, వార్షిక మరమ్మతుల కోసం మంగళవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో మురళీకొండ, లెప్రసీ కాలనీ, సోమనవారి తోట, కొత్తపేట, పాత బొమ్మూరు, వడ్డి వీరభద్రనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

నేడు పీజీ గ్రాడ్యుయేషన్ డే

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మంగళవారం పీజీ గ్రాడ్యుయేషన్ డేకు వేదిక కానుంది. ఈ వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే సోమవారం తెలిపారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో తొలిసారిగా జరుగుతున్న పీజీ గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో 2018, 2019, 2020 విద్యా సంవత్సరాల్లో పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేయనున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రసన్నశ్రీ, గుజరాత్ బీఎంటీయూ విశ్వవిద్యాలయం ఉపకులపతి మధుకర్ భాయ్ ఎస్.పృథ్వీ, కళాశాల ఉన్నత విద్యా శాఖ డైరెక్టర్ నారాయణ భరత్‌గుప్తా, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి కృష్ణ, కళాశాల సీపీడీసీ సెక్రెటరీ తుమ్మిడి రామ్‌కుమార్ హాజరుకానున్నారు.

ర్యాంపు అనధికార నిర్వహణపై పోలీసులకు ఫిర్యాదు

సీతానగరం: మండలంలోని ముగ్గళ్ల ఇసుక ర్యాంపు అనధికార నిర్వహణపై చర్యలు తీసుకోవాలంటూ అదే గ్రామానికి చెందిన పలువురు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ర్యాంపు అనధికార నిర్వహణ వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామంటూ ఆదివారం చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామంలో ఇసుక డంపింగ్‌లు ఎక్కువయ్యాయని, వీటి వల్ల డ్రైనేజీలోకి ఇసుక చేరి మూసుకుపోతున్నాయని, నీరు నిలిచిపోతుందని, రోడ్డుపై ఇసుక వల్ల వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని వివరించారు. పోలీసులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే సింగవరం, ముగ్గళ్ల అనధికార ర్యాంపుల నుంచి అధిక సంఖ్యలో ట్రాక్టర్లపై ఇసుకను తరలిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన అధికార ర్యాంపు వంగలపూడి నుంచి తీసుకువెళ్లాల్సిన ఇసుకను ప్రజాప్రతినిధుల అండదండలతో అనధికార ర్యాంపుల నుంచి ట్రాక్టర్లపై ఇతర మండలాలకు తరలిస్తున్నారు.

సినిమాలు



శ్యామల	:	జింఖానా
సూర్యమినీ	:	రైడ్–2
సూర్యప్యాలెస్	:	థండర్‌బోల్ట్స్
స్వామి	:	హిట్–3
శివజ్యోతి	:	హిట్–3
అనుశ్రీ	:	హిట్–3
రాజా	:	హిట్–3
ఊర్వశి	:	హిట్–3
మేనక	:	అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి
రంభ	:	గుడ్‌బ్యాడ్‌అగ్లీ, అన్‌టిల్‌డాన్
కుమారి	:	సారంగపాణిజాతకం
అప్సర	:	రెట్రో
అశోక	:	రెట్రో
నామవరం		
వివిఎస్‌మహల్	:	హిట్–3
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	హిట్–3
కడియం		
వెంకటసూర్య	:	హిట్–3

వ్యర్థాల దహనం.. ప్రకృతి హననం

- విచ్చలవిడిగా పంట అవశేషాల కాల్చివేత
- సారం కోల్పోతున్న భూములు
- అంతరిస్తున్న మిత్ర పురుగులు
- హెచ్చరిస్తున్న వ్యవసాయ నిపుణులు



పెద రాయవరంలో పొలంలోనే గడ్డి తగులబెడుతున్న రైతులు



చంద్రేడులో పొలంలోనే మినుము కాడ దహనం

రంగంపేట: ఖరీఫ్, రబీ సాగు పూర్తయిన తరువాత పంట అవశేషాలను దహనం చేయడం రైతులకు అలవాటుగా మారింది. ఇలా చేయడం వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించడంతో పాటు, భూమిలో అనేక మార్పులు జరిగి భూసారం కోల్పోయే ప్రమాదం ఉంది. ఫలితంగా పంట దిగుబడులు తగ్గి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. దహనం చేయడానికి బదులు ఈ అవశేషాలను భూమిలో కలియ దున్నడం వల్ల భూసారం పెరిగి, తదుపరి పంటలో అధిక దిగుబడి పొందే అవకాశం ఉంటుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

అనపర్తి నియోజకవర్గంలో బిక్కవోలు, పెదపూడి, అనపర్తి మండలాల్లో ఎక్కువగా వరి, రంగంపేట మండలంలో వరితో పాటు, మొక్కజొన్న, మినుము, శనగ, పొగాకు, మిరప, పత్తి పంటలు సాగు చేస్తుంటారు. ఈ సీజన్‌లో రంగంపేట మండలంలో 2,100 ఎకరాలు, పెదపూడి మండలంలో 16 వేల ఎకరాలు, అనపర్తి మండలంలో 11,500 ఎకరాలు, బిక్కవోలు మండలంలో 12 వేల ఎకరాల విస్తీర్ణంలో సాగు చేశారు. ఇప్పటికే కోతలు దాదాపు పూర్తి కావచ్చాయి. సుమారు 90 శాతం రైతులు పంట అవశేషాలను పొలాల్లోనే కాల్చివేస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో వరి, మినుము, శనగ పంటలు పూర్తి కావడంతో, ఆయా పంటల అవశేషాలను యథేచ్ఛగా పొలాల్లోనే దహనం చేస్తున్నారు. వ్యవసాయ శాఖాధికారులు పలుమార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది.

తలెత్తే అనర్థాలివే..

- నేల స్వాభావిక లక్షణాలు మారిపోతాయి.
- భూమిలో సేంద్రియ కర్బనం తగ్గిపోతుంది.
- భూసారం తగ్గి పరోక్షంగా దిగుబడులపై ప్రభావం చూపుతుంది.
- నేలలో తేమ శాతం గణనీయంగా తగ్గుతుంది.
- నేలలో ఆమ్ల గుణం తగ్గిపోతుంది.
- పర్యావరణ కాలుష్యం పెరిగి, ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుంది.
- అధిక మోతాదులో రసాయన ఎరువులు వినియోగించాల్సి వస్తుంది. ఫలితంగా నేల సమతుల్యత దెబ్బతింటుంది.
- భూమి పొరల్లో పంటకు, నేలకు మేలు చేసే మిత్ర పురుగులు నశిస్తాయి.

కలియదున్నితే మేలు

పంట అవశేషాలను భూమిలో కలియ దున్నడం వల్ల సేంద్రియ కర్బనం పెరిగి రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పూర్వం రైతులు పంట అవశేషాలను భూమిలో కలిదున్నేవారు. దీని ఫలితంగా అవి భూమిలో కుళ్లిపోయి తర్వాత పంటలకు మంచి ఎరువుగా మారేవి. కాలక్రమేణా రైతులు ఈ పద్ధతికి స్వస్తి చెప్పి, పొలంలోనే తగులబెట్టడం అలవాటుగా చేసుకున్నారు. దీనివల్ల రైతులకు తెలియకుండానే భూమికి అనేక విధాలుగా నష్టం కలుగుతోంది. నిప్పు పెట్టడం వల్ల తర్వాత సాగు చేయబోయే పంటలపై దుష్ప్రభావం చూపడమే కాకుండా, వాతావరణ కాలుష్యం, అగ్ని ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి.

కలియదున్నడం ఉత్తమం



పంట అవశేషాలను రైతులు భూమిలో కలియదున్నాలి. అవశేషాలు కుళ్లిపోయి, ఆ తర్వాత సాగు చేసే పంటకు మంచి ఎరువుగా ఉపయోగపడుతుంది. సేంద్రియ ఎరువుల వల్ల భూసారం పెరిగి, నాణ్యమైన దిగుబడులు లభిస్తాయి. దీనివల్ల ఎరువుల వాడకం, పెట్టుబడులు తగ్గుతాయి. వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించవచ్చు.

– కె.శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి, రంగంపేట